క్లుప్తంగా

రేపు 'కడప బాలోత్సవం'పై సమావేశం

కడప కల్చరల్ : స్థానిక బాలాజీనగర్‌లో గల ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాయంత్రం 5 గంటలకు బాలల కార్యక్రమాలపై అనుభవం, ఆసక్తి గల వారితో సమావేశం నిర్వహించనున్నామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. ఇందులో కడప బాలోత్సవ నిర్వహణలో కార్యక్రమాల సమీక్ష, బాలోత్సవ నిర్వహణ, కమిటీల ఎన్నిక, బాధ్యతల నిర్వహణ తదితర అంశాలపై చర్చిస్తామని, కమిటీలను ఎంపిక చేస్తామని తెలిపారు.

స్టేట్ టోర్నమెంట్ పోటీల్లో ప్రతిభ



విజయం సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా అరగొండ మండలంలో ఆదివారం నేషనల్ చాంపియన్‌షిప్ మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 10 జిల్లాల కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలలో విజయం సాధించి బంగారుతోపాటు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. వారిని కళాశాల కరస్పాండెంట్, ఫాదర్ ఆరోగ్య స్వామి, ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, అసిస్టెంట్ ఫాదర్ కెపు చంద్ర, పీడీ ప్రసాద్, వార్డన్ శ్రీను, విజయ్‌కుమార్ అభినందించారు.

చెస్ పోటీల్లో విజయం



సాధించిన బహుమతులతో చెస్ ఆటగాళ్లు

కడప ఎడ్యుకేషన్ : నెల్లూరు జిల్లాలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇందిరా గాంధీ మెమోరియల్ నేషనల్ లెవల్ ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి బహుమతులు సాధించారని వైఎస్సార్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అనీస్ బర్బారీ తెలిపారు. అండర్ 9 బాలికల విభాగంలో లక్ష్మి మనుశ్రీ మొదటి స్థానం, అండర్ 7 బాలికల విభాగంలో అమీనా 4వ స్థానం, అండర్ 13 బాలికల విభాగంలో తేజోమయి 3వ స్థానం, అండర్ 11 బాలికల విభాగంలో ఖ్యాతీమై రెండవ స్థానం, అండర్ -15 బాలికల విభాగంలో స్పందన రెండవ స్థానం, అండర్ 7 బాలుర విభాగంలో రెవంత్ పదవ స్థానం, అండర్-9 విభాగంలో గుణవర్ధన్ 9వ స్థానం, ప్రణీత 11వ స్థానంలో పూజ 5వ స్థానంలో విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు. విజేతలకు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్ బహుమతులను ప్రదానం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని డీసీసీ గుండ్లకుంట శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ నేతలు పెద్దలకే రుణమాఫీ చేస్తారని, రైతులు, కార్మికులకు మాత్రం రుణ మాఫీ చేయరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెను జయప్రదం చేయండి

కమలాపురం : అంగన్‌వాడీలకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ, పెన్షన్ అమలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8వ తేదీ నుంచి చేపట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ రాక

వేంపల్లె : నేడు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వేంపల్లెకు రానున్నట్లు వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు వేంపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

కనుల పండువగా కార్తీక దీప శోభ



మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కార్తీక పూజోత్సవంలో శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి

కడప కల్చరల్ : శివభక్తులకు నెల రోజులపాటు తనివి తీరా పూజలు చేసుకునే అవకాశం కల్పించే కార్తీక మాసం వచ్చేసింది. అందులో ప్రధానంగా సోమవారం పూజలకు ఎంతో విశిష్టత ఉంది. దాదాపు తొలి సోమవారంగా భావించిన భక్తులతో దీపాలతో శివాలయాలు మెరిసిపోయాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆలయాల్లో శివయ్య మూలమూర్తికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కొన్నిచోట్ల రుద్ర హోమాలు, మిగతా అన్ని ప్రాంతాల్లో బిల్వపత్రార్చన తదితర పూజలు నిర్వహించారు. దేవాలయాలన్నీ ఉదయం నుంచి 11 గంటల వరకు లింగాష్టకంతో మార్మోగాయి. విశేష అలంకరణ అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణాలన్నీ కార్తీక దీపాలతో కళకళలాడాయి. దాదాపు అన్ని ఆలయాలలో ఓ దశలో దీపాలు పెట్టేందుకు చోటే లేకుండా పోయింది. ఏమాత్రం చిన్న స్థలం లభించినా అక్కడ దీపాలు పెట్టి శివయ్యను ఆరాధించి పూజలు నిర్వహించారు. పిండి దీపాలు, వంద, వెయ్యి, పది వేలు ఒత్తుల దీపాల వెలుగుతో కార్తీక దీప శోభ కనిపించింది. ఉదయం 3 గంటల నుంచే భక్తులు ఆలయాల వద్ద తొలి దర్శనానికి బారులు తీరారు. కొన్ని దేవాలయాలలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. కడప నగరంలోని మృత్యుంజయ కుంట శివాలయం, దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయం, మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం, గడ్డిబజారు శివాలయం, నబీకోట శివాలయంతోపాటు నగరంలోని దాదాపు అన్ని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ఈ సందర్భంగా పూజలు చేయడం మంచిదని భావించి తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనాల కోసం భక్తులు దేవాలయాల బాట పట్టారు.

కార్తీక పూజల్లో ప్రముఖులు

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలువురు ప్రముఖులు కూడా విశేష అలంకారంలో ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కార్తీక దీపాలు, ఆకాశ దీపాలు వెలిగించి పూజలు చేశారు. దేవునికడప శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో జడ్జి జి.శ్రీదేవి, రామారావు దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని దీపాలు పెట్టి ఆకాశ దీపోత్సవంలో పాల్గొన్నారు. మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయానికి జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజోత్సవాలకు న్యాయమూర్తులు ప్రదీప్, కవితలు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆయా ఆలయాల అర్చకులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికి పూజలు చేయించి సంప్రదాయంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేయాలి



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 23వ తేది నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత ఇచ్చి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో ఆయా వర్గాలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎక్కువ మేలు జరిగిందన్నారు. దీన్ని ప్రజలందరికీ వివరించడానికే సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ బస్సుయాత్రలో పదివేల మందికి తక్కువ కాకుండా ప్రజలు పాల్గొనేలా కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు కృషి చేయాలన్నారు. 23వ తేదీ మధ్యాహ్నం రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్ నుంచి బస్సుయాత్ర ప్రారంభమవుతుందని, పాతబస్టాండు మీదుగా ఏడురోడ్ల కూడలికి చేరుతుందని, అక్కడ ముఖ్య అతిథులు ప్రసంగిస్తారన్నారు. బస్సుయాత్రకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, సినీ నటుడు అలీ, మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్‌తోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి పంట పరిశీలన

వీరపునాయునిపల్లె: వైఎస్సార్ ఉద్యానవన పరిశోధన కేంద్రం మహానంది సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఠాకూర్‌నాయక్ మండలంలో సాగు చేసిన ఉల్లి పంటను పరిశీలించారు. పంట సాగు చేసి మొలక రాక కొంత, మొలక వచ్చి కొంత చనిపోతున్నాయని రైతులు అధికారులకు తెలిపారు. మండలస్థాయి అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వచ్చి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. సోమవారం పాయసంపల్లె, కీర్తిపల్లె, ఇందుకూరు గ్రామాల్లో పర్యటించి పంట సాగు చేసిన రైతులతో మాట్లాడి సాగు వివరాలను సేకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉల్లి పంట చనిపోవడం వాస్తవమేనన్నారు. పూర్తిగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, ఉద్యానవన శాఖ అధికారి రెడ్డెయ్య, వ్యవసాయ సహాయకులు ఇంతియాజ్, వాణి, రైతులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలలో పదవ తరగతి పరీక్ష ఫీజు పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న కార్పొరేట్, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీసీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని కడపలోని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జోన్ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేటు, ఎయిడెడ్ యాజమాన్యాలు పదో తరగతి పరీక్ష ఫీజు రూ.125 కాగా, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ. 15 వందల నుంచి 3 వేల వరకు రాబడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ, శ్రీనాథ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్.రవి మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. కోవిడ్ -19లో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. పీహెచ్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. క్లాప్ వర్కర్లకు రూ.18500 జీతం చెల్లించాలని, డ్రైవర్లకు రూ.32500 జీతం ఇవ్వాలన్నారు. అడిషనల్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. ఎలక్ట్రికల్ సిబ్బందికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ నెల 21వ తేది కలెక్టరేట్ వద్ద జరిగే వంటా వార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు గోపి, పుల్లయ్య, నాగరాజు, ఆనంద్, అదాం, శివ మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఏబీవీపీ జిల్లా కార్యదర్శి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా పత్రిక ప్రకటన ఇవ్వడం దారుణం అన్నారు. దీంతో ఎంతో మంది నిరుద్యోగులు నష్టపోతారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలలు ప్రతికా ప్రకటన ద్వారా ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేయడం ఏమిటని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఎయిడెడ్ పాఠశాలల ఉద్యోగ నోటిఫికేషన్‌ను రద్దు చేసి డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిఖిల్, జస్వంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లయోలా పాల్‌టెక్నిక్ విద్యార్థి ప్రతిభ

పులివెందుల టౌన్ : మదనపల్లె విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నికల్ ఫెస్ట్‌లో పులివెందుల లయోలా పాల్‌టెక్నిక్ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ముస్తకిమ్ పఠాన్ సంచలనం సృషించాడు. కళాశాలలో నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పో, కోడ్ డిబగ్గింగ్, టెక్నికల్ క్విజ్, టెడ్క్స్ టాక్‌లలో ప్రథమ బహుమతి సాధించగా.. జామ్, టెక్ డి బేట్‌లలో రెండవ బహుమతి గెలుచుకున్నాడు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ఫాదర్ బి బ్రో, వైస్ ప్రిన్సిపాల్ జయరాజులు అభినందించారు.

జగనన్నతోనే నవరత్నాల అమలు



అరవిందనగర్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే నవరత్నాల రూపంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయిని వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షులు పి.జయచంద్రారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ఎం.రామలక్ష్మణ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక 13వ డివిజన్‌లోని అరవిందనగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ రోడ్డు వద్ద వైఎస్సార్ జెండాను ఆవిష్కరించి, అరవిందనగర్ రామాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్ల టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ ఈ జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే జరుగుతోందని తెలిపారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్, జెండా, టోపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బుడ్డాయపల్లెలో..

కడప నగరం 4వ డివిజన్‌లోని బుడ్డాయపల్లెలో 'ఆంధ్రాకు ఎందుకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు తోటక్రిష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జున, 4వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా వారు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల డివిజన్‌కు, అక్కడి ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లు, కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, యల్లారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డిజిటల్ విద్య ఎంతో ఉపయోగకరం



పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీని అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ అన్నారు. సోమవారం కెనరా బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని కాగితాలపెంట మండల పరిషత్ హైస్కూలులో 43 ఇంచీల ఎల్‌ఈడీ టీవీని ఎంఈఓ నారాయణ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ తల్లిదండ్రులతోపాటు పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఎంఈఓ నారాయణ మాట్లాడుతూ కెనరా బ్యాంకు యాజమాన్యం పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీ అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ మేనేజర్ సంపత్‌కుమార్, మేనేజర్ సింహం రత్నపాల్, ఎంఈఓ అర్షద్ అహ్మద్, హెడ్మాస్టర్లు ఆరోగ్యమ్మ, బాలనాయుడు, రాజు, బ్యాంకు సిబ్బంది జగదీష్, దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదాలు, నివారించే పద్ధతులను వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వైవీయూ : అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అప్రమత్తత, సమయస్ఫూర్తి ఎంతో అవసరమని 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా అన్నారు. కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న సీఏటీసీ-12వ క్యాంపు శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్స్‌కు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన, డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను నిజజీవితంలో ఉపయోగించుకోవాలని సూచించారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్.నీలయ్య మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన అంశాలను వివరించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది వీరారెడ్డి తదితరులు అగ్నిప్రమాదాలు, నివారణపై వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ మహేష్, రాజు, పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిష్నోయ్, సీఎల్ రెడ్డి, జగదీష్, సమయసింగ్, కార్యాలయ సూపరింటెండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, ప్రియ, రాజగోపాల్‌రెడ్డి, శివప్రసాద్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న కె.శ్రీనివాసులురెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ట్రాన్స్‌కో, జెన్కో, పంపిణీ సంస్థల ఉద్యోగులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం ఉద్యోగ సంఘాలతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులపై తీవ్ర పని భారం, ఒత్తిడి ఉందని, సర్వీసులకు అనుసరించి పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నాయబ్ రసూల్, ఏరికలరెడ్డి, రామ్మోహన్, షరీఫ్, కడప డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను సమగ్రంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఎస్ఈ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : స్వాతంత్ర్య ఉద్యమంలో భారతదేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ విగ్రహాన్ని కడప నగరంలో ఏర్పాటు చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కడప నగరపాలక కార్యాలయంలో కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలోనే దేశం కోసం ప్రాణాలను అర్పించిన సమరయోధుడు భగత్‌సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు హరి, నాయకులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత సీఎం వైఎస్ జగన్



కమలాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సంక్షేమ పథకాల ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, కరోనా సమయంలో సైతం సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరుగులు పెట్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం-3వ వార్డు సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా ఆ సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మారుజోళ్ల కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేశారు. కమలాపురం 3వ వార్డు సచివాలయం పరిధిలో రూ.17.8 కోట్లు ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా చేరిందన్నారు. అలాగే రూ. 2.85కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్రరెడ్డి జెండా ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, గఫార్, నిఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరు : టీడీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు, కరువు కవల పిల్లలని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి అన్నారు. పైడికాలువ గ్రామ సచివాలయం ఆవరణలో సోమవారం జరిగిన మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా వున్నంతకాలం కరువు విలయ తాండవం చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా వున్న 4 సంవత్సరాలు సమృద్ధిగా వర్షాలు కురిశాయన్నారు. చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్‌లు ఈ ఏడాది రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించడంతో రాష్ట్రంలో ఈ ఏడాది వర్షాలు కురవక కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పైడికాలువ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.30 కోట్ల 66 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం సంక్షేమ బోర్డును, పార్టీ జండాను అవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ చెన్నమ్మ, పార్టీ నేతలు ఓబీ సుబ్బారెడ్డి, సుదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రాఘవ రెడ్డి, మునీంద్రారెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఈశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలటీర్లు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె సచివాలయంలో సోమవారం నిర్వహించిన ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల పట్టిక బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, స్థానిక నాయకులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాల బోర్డును అవిష్కరించి జెండాను ఎగురవేశారు. జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రామతులసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.